హైదరాబాద్ చాంప్ భవేష్ రెడ్డి జోడీ

జిల్లా బ్యాడ్మింటన్ టైటిల్ కైవసం

హైదరాబాద్: బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ నిర్వహించిన 'హైదరాబాద్ జిల్లా చాంపియన్‌షిప్' టోర్నీలో యువ షట్లర్లు భవేష్ రెడ్డి, సాయిష్ జోడీ విజేతగా నిలిచారు. ఈనెల 20న మాధాపూర్‌లోని గేమ్‌పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీలో అండర్ 13, 15, 17, 19 విభాగాల్లో పోటీలను నిర్వహించగా.. అండర్ 13 బాలుర డబుల్స్ ఫైనల్లో భవేష్ రెడ్డి, సాయిష్ ద్వయం 21-14, 21- 19 తో దర్శ్ గోయల్, ధ్రువ్‌సింగ్ జంటపై అద్భుత విజయం సాధించారు. ఈ విజయంతో భవేశ్-సాయిష్ రాష్ట్రస్థాయి టోర్నీలకు అర్హత సాధించారు. అంతకుముందు అండర్ 13 సింగిల్స్ విభాగంలో.. క్రిష్ 21-10, 21-16తో భవేష్‌పై విజయం సాధించడంతో అతడు రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. ఈ పోటీలలో విజేతలకు ప్రముఖ బాక్సర్ నిఖత్ జరీన్, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ చాముండేశ్వరినాథ్, తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు.

నాగల్‌కు తొలి రౌండ్‌లోనే కఠిన సవాల్

జ్వెరెవ్‌తో ఫ్రెంచ్ ఓపెన్ పోరు మొదలుపెట్టనున్న నాదల్

పారిస్: ప్రతిష్టాత్మక ఫ్రెంచ్ ఓపెన్‌లో భారత యువ టెన్నిస్ ఆటగాడు సుమిత్ నాగల్‌కు తొలిరౌండ్‌లోనే కఠినమైన ప్రత్యర్థి ఎదురయ్యాడు.మొదటి రౌండ్‌లో అతడు.. ప్రపంచ 18వ ర్యాంకర్ కరెన్ ఖచనోవ్ (రష్యా)తో అమీతుమీ తేల్చుకోనున్నాడు. ఈనెల 26 నుంచి మొదలుకాబోయే ఈ టోర్నీలో మట్టి కోర్టు మహారాజు రఫెల్ నాదల్.. ఫస్ట్ రౌండ్‌లో ప్రపంచ నాలుగో ర్యాంకర్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌తో తలపడనున్నాడు. నాదల్‌కు ఇదే ఆఖరి (?) ఫ్రెంచ్ ఓపెన్‌గా భావిస్తున్న నేపథ్యంలో తొలి రౌండ్‌లోనే అతడికి కఠిన సవాల్ ఎదురవడం గమనార్హం. డిఫెండింగ్ చాంపియన్ నొవాక్ జొకోవిచ్.. హ్యూగ్స్ హర్బర్ట్ (ఫ్రెంచ్)తో తొలి మ్యాచ్ ఆడనున్నాడు.

క్వార్టర్స్‌కు సింధు, అష్మిత

ప్రిక్వార్టర్స్‌లోనే ముగిసిన కిరణ్, త్రిసా-గాయత్రి పోరు ● మలేషియా మాస్టర్స్

కౌలాలంపూర్: మలేషియా మాస్టర్స్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. స్వల్ప విరామం తర్వాత బరిలోకి దిగిన ప్రపంచ 15వ ర్యాంకర్ సింధు.. గురువారం జరిగిన మహిళల సింగిల్స్‌లో ప్రిక్వార్టర్స్‌లో 21-13, 12-21, 21-14తో కొరియా అమ్మాయి సిమ్ యు జిన్‌పై పోరాడి గెలిచింది. 59 నిమిషాల పాటు జరిగిన ఈ పోరులో తొలి రౌండ్ అలవోకగానే నెగ్గిన సింధు.. ఆ తర్వాత తడబడినా మళ్లీ మూడో రౌండ్‌లో పుంజుకుని క్వార్టర్స్‌కు అర్హత సాధించింది. అష్మిత చాహిల.. 21-19, 16-21, 21-12తో పదో ర్యాంకర్ బీవెన్ జంగ్ (యూఎస్ఏ)ను చిత్తుచేసి క్వార్టర్స్ పోరుకు సిద్ధమైంది. పురుషుల సింగిల్స్‌లో కిరణ్ జార్జి.. 13-21, 18-21తో మలేషియా ఆటగాడు లి జి జియా చేతిలో ఓడటంతో అతడి పోరాటం ముగిసింది. మహిళల డబుల్స్‌లో త్రిసా - గాయత్రి జోడీ.. 18-21, 22-20, 14-21తో కొరియన్ ద్వయం సుంగ్ షువో యున్-యు చిన్ హుయి ధాటికి చిత్తైంది. మిక్స్‌డ్ డబుల్స్ జంట సుమిత్ - సిక్కీ.. 9-21, 15-21తో చెన్ టాంగ్ జీ - టో ఈ వీ (మలేషియా)కు తలవంచింది.

కేకేఆర్‌ను 'ఢీ' కొట్టెదెవరో?

నేడే హైదరాబాద్, రాజస్థాన్ క్వాలిఫయర్-2 పోరు

గెలుపు జోష్‌లో రాయల్స్ ● గాడిన పడకుంటే సన్‌రైజర్స్ కథ కంచికే..

రాత్రి 7:30 గంటల నుంచి

చెన్నై: ఐపీఎల్-17లో ఇదివరకే ఫైనల్ చేరిన కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)ను టైటిల్ పోరులో ఢీకొనబోయే జట్టేదో నేడు తేలనుంది. శుక్రవారం చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్).. రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్)తో అమీతుమీ తేల్చుకోనుంది. క్వాలిఫయర్-1లో కేకేఆర్ చేతిలో అవమానకర ఓటమి ఎదుర్కున్న ఎస్ఆర్‌హెచ్‌తో పాటు లీగ్ చివరి దశలో వరుసగా నాలుగు మ్యాచ్‌లు ఓడినా బెంగళూరును 'ఎలిమినేట్' చేసిన రాజస్థాన్‌కూ టైటిల్ వేటలో 'క్వాలిఫయర్-2' అత్యంత కీలకం. బ్యాటింగ్ పవర్ హౌజ్‌గా ఉన్న హైదరాబాద్.. స్పిన్‌కు అనుకూలించే చెపాక్ పిచ్‌పై అత్యుత్తమ స్పిన్నర్లు కలిగిన రాయల్స్‌ను ఎదుర్కోనుండటంతో చెన్నైలో మరో రసవత్తర పోరు ఖాయం!

'హెడ్' ఏం చేసేనో?

ఈ సీజన్‌లో హైదరాబాద్ ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (533 పరుగులు), అభిషేక్ శర్మ (413) భీకర ఫామ్‌లో ఉన్నప్పటికీ.. ఆసీస్ ఓపెనర్ గత రెండు మ్యాచ్‌లలో డకౌట్ అవడం హైదరాబాద్‌ను ఆందోళనకు గురిచేసేదే. కోల్‌కతాతో మ్యాచ్‌లో అతడు నిష్క్రమించగానే అభిషేక్ కూడా చేతులెత్తేయడం రైజర్స్‌ను దెబ్బతీసింది. ఈ ఇద్దరూ చెపాక్ పిచ్‌పై రాజస్థాన్ స్పిన్ ద్వయం అశ్విన్, చాహల్‌ను ఏ మేరకు ఎదుర్కుంటారనేది ఆసక్తికరం. కొత్తబంతితో నిప్పులు చెరిగే బౌల్ట్‌తోనూ ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో ఓపెనర్లు నిలదొక్కుకుంటేనే హైదరాబాద్‌కు మెరుగైన స్కోరు చేసే అవకాశముంటుంది. గత రెండు మ్యాచ్‌లలో రాణించిన రాహుల్ త్రిపాఠికి తోడు నితీశ్ రెడ్డి, క్లాసెన్ నిలబడితేనే భారీ స్కోరుకు బాటలు వేయొచ్చు. కమిన్స్ నేతృత్వంలోని బౌలింగ్ దళం ప్రదర్శన హైదరాబాద్‌ను భయపెడుతున్నా తక్కువ స్కోర్లు నమోదయ్యే చెన్నై పిచ్‌పై బౌలర్లు సత్తాచాటాలని ఎస్ఆర్‌హెచ్ ఆశిస్తోంది.

సమిష్టితత్వాన్నే నమ్ముకున్న రాయల్స్

ఐపీఎల్-17 ఆరంభంలో నిలకడగా విజయాలు సాధించి తర్వాత తడబడ్డా ఎలిమినేటర్‌లో సమిష్టిగా రాణించిన రాయల్స్.. మరోసారి ఆల్‌రౌండ్ ప్రదర్శననే నమ్ముకుంది. నాకౌట్ దశలో జైస్వాల్ ఫామ్‌ను అందుకోవడం ఆ జట్టు బ్యాటింగ్ బలాన్ని మరింత పెంచేదే. శాంసన్ టచ్‌లోనే ఉండగా మిడిలార్డర్‌లో రియాన్ పరాగ్, షిమ్రన్ హెట్‌మెయర్, రోవ్‌మన్ పావెల్, ధ్రువ్ జురెల్ వంటి హిట్టర్లతో ఆ జట్టు దుర్బేధ్యంగా ఉంది. అంతగా పటిష్టంగా లేని హైదరాబాద్ బౌలింగ్ దళం వీరి దూకుడుకు అడ్డుకట్ట వేయకుంటే ఎస్ఆర్‌హెచ్‌కు తిప్పలు తప్పవు. చెన్నై పిచ్ గురించి అణువణువూ తెలిసిన అశ్విన్‌తో పాటు లెగ్ స్పిన్నర్ చాహల్ రాజస్థాన్ బౌలింగ్‌కు కీలకం కానున్నారు.

పిచ్, వాతావరణం

మెరీనా తీరాన ఉన్న చెపాక్‌లో రెండో ఇన్నింగ్స్ కీలకం. టాస్ గెలిచిన జట్టు మొదట బౌలింగ్‌కే మొగ్గుచూపొచ్చు. ఇక్కడ ఛేదన చేసే జట్టుకే విజయావకాశాలు ఎక్కువ కాగా ఈ సీజన్‌లో ఏడు మ్యాచ్‌లలో రెండోసారి బ్యాటింగ్ చేసిన జట్టే ఐదుసార్లు గెలిచింది. చెన్నైలో గత రెండ్రోజులుగా తేలికపాటి వర్షాలు పడుతుండటంతో వరుణుడు ఈ మ్యాచ్‌ను సాగనిస్తాడా..? అన్నది ఆందోళన పరిచేదే. మ్యాచ్ సమయానికి చెపాక్‌లో వర్షం పడే అవకాశాలున్నట్టు వాతావరణ శాఖ నివేదికలు హెచ్చరిస్తుండటం గమనార్హం.

తుది జట్లు (అంచనా):

హైదరాబాద్: హెడ్, అభిషేక్, రాహుల్, నితీశ్, క్లాసెన్, సమద్, షాబాజ్, కమిన్స్, భువనేశ్వర్, వియస్కాంత్, నటరాజన్

రాజస్థాన్: జైస్వాల్, కోహ్లర్, శాంసన్, పరాగ్, జురెల్, హెట్‌మెయర్, పావెల్, అశ్విన్, బౌల్ట్, అవేశ్, చాహల్

ఐపీఎల్‌కు దినేశ్ కార్తీక్ వీడ్కోలు

రాజస్థాన్‌తో మ్యాచ్ తర్వాత రిటైర్మెంట్ నిర్ణయం

ఢిల్లీ: రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్.. 17 ఏండ్ల తన సుదీర్ఘ ఐపీఎల్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ఐపీఎల్-17 ఎలిమినేటర్ మ్యాచ్‌లో భాగంగా బుధవారం రాజస్థాన్ రాయల్స్‌తో పోరు తర్వాత ఆర్సీబీ ఆటగాళ్లు అతడికి 'గార్డ్ ఆఫ్ హానర్' ఇవ్వగా ఈ లీగ్ డిజిటల్ ప్రసారదారు జియో తన 'ఎక్స్' ఖాతాలో డీకే రిటైర్మెంట్ విషయాన్ని వెల్లడిస్తూ ట్వీట్ చేసింది. మ్యాచ్ ఓడిపోయాక నిరాశగా వెనుదిరుగుతున్న డీకే.. డ్రెస్సింగ్ రూమ్ వైపునకు వెళ్తుండగా ప్రేక్షకులకు అభివాదం చేస్తూ భావోద్వేగానికి గురయ్యాడు. ఐపీఎల్ ఆరంభ ఎడిషన్ (2008) నుంచి బుధవారం నాటి రాజస్థాన్‌తో మ్యాచ్ దాకా 17 సీజన్ల పాటు ఆరు ఫ్రాంచైజీ (ఢిల్లీ, పంజాబ్, ముంబై, బెంగళూరు, కోల్‌కతా, గుజరాత్) లకు అతడు ప్రాతినిధ్యం వహించాడు. మొత్తంగా ఈ లీగ్‌లో 257 మ్యాచ్‌లు ఆడిన కార్తీక్.. 4,842 పరుగులు చేశాడు. ఇందులో 22 అర్ధ సెంచరీలు ఉన్నాయి. తాజా సీజన్‌లో 15 మ్యాచ్‌లు ఆడి 187 స్ట్రైక్ రేట్‌తో 326 రన్స్ సాధించాడు. జాతీయ జట్టులో ధోనీ నీడన దక్కాల్సినన గుర్తింపు దక్కకపోయినా ఐపీఎల్‌లో మాత్రం డీకే తనదైన ముద్ర వేశాడు.

ఐపీఎల్‌లో డీకే ఘనతలు:

- 'ఫినిషర్'గా పేరున్న కార్తీక్.. 17-20 ఓవర్లలో ఆడుతూ 1,565 పరుగులు (837 బంతుల్లోనే) సాధించి ఈ జాబితాలో ధోనీ (2,786), పొలార్డ్ (1,708) తర్వాతి స్థానంలో నిలిచాడు.
- ఐపీఎల్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన వారిలో ధోనీ (262) తర్వాత డీకే (257)ది రెండో స్థానం. ఈ లీగ్‌లో కార్తీక్.. 137 క్యాచ్‌లు, 37 స్టంపింగ్స్ చేసి మొత్తంగా 174 డిస్మిసల్స్‌తో మహేంద్రుడి (190) తర్వాత రెండో స్థానంలో ఉన్నాడు.
- 17 ఏండ్ల ఐపీఎల్ కెరీర్‌లో డీకే మిస్ అయిన మ్యాచ్‌లు రెండు మాత్రమే. 2008లో ఢిల్లీకి ఆడుతుండగా ఒకసారి 2023లో బెంగళూరుకు ఆడుతూ మరోసారి బెంచ్‌లో కూర్చున్నాడు.

తేజస్ నయా జాతీయ రికార్డు

హెల్సింకి: భారత యువ అథ్లెట్ తేజస్ శిర్స్ 110 మీటర్ల హర్డిల్స్‌లో సరికొత్త జాతీయ రికార్డును సృష్టించాడు. ఫిన్‌లాండ్ వేదికగా జరుగుతున్న వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్‌లో భాగంగా పురుషుల 110 మీటర్ల హర్డిల్స్ రేసును 13.41 సెకన్లలోనే పూర్తిచేసి స్వర్ణం గెలవడంతో పాటు నయా జాతీయ రికార్డు నెలకొల్పాడు. 2017లో ఈ రికార్డు (13.48 సెకన్లు) సిద్ధార్థ్ తింగల్య నమోదు చేశాడు. అయితే పసిడి పతకం గెలిచినా తేజస్ మాత్రం పారిస్ ఒలింపిక్స్ క్వాలిఫికేషన్ (13.27 సెకన్లు) మార్కుకు 0.14 సెకన్ల దూరంలో నిలిచాడు. ఇదే టోర్నీలో మహిళల 100 మీటర్ల హర్డిల్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ.. 12.78 సెకన్లతో స్వర్ణం నెగ్గినా ఆమె కూడా పారిస్ ఒలింపిక్స్ అర్హత (12.77 సెకన్లు)కు ఒక్క సెకన్ తేడాతో మిస్ అయింది.

సెమీస్‌కు ప్రథమేశ్

● నిరాశపరిచిన రికర్వ్ ఆర్చర్లు

యోచియోన్: ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-2లో భారత యువ ఆర్చర్ ప్రథమేశ్.. పురుషుల కాంపౌండ్ ఈవెంట్‌లో సెమీస్‌కు ప్రవేశించాడు. గురువారం జరిగిన క్వార్టర్స్ పోరులో 146-145 తో నికో వీనర్ (ఆస్ట్రేలియా)ను ఓడించాడు. సెమీఫైనల్స్‌లో అతడు.. యూఎస్ఏ ఆర్చర్ జేమ్స్ లుట్జ్‌తో ఢీకొననున్నాడు. మహిళల వ్యక్తిగత కాంపౌండ్ క్వార్టర్స్‌లో జ్యోతి సురేఖ వెన్నం.. 142-145 తో సారా లోపెజ్ చేతిలో ఓడింది. పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్ మొదటి మ్యాచ్‌లో కెనడా త్రయం ఎరిక్, బ్రాండన్, రీస్ విల్సన్.. 5-3 తేడాతో తరుణ్‌దీప్, ధీరజ్, మృణాల్ చౌహాన్‌ను ఓడించారు.

వాణిజ్య

ఆజాద్‌కు డీఆర్‌డీవో ఆర్డర్

హైదరాబాద్, మే 23: డిఫెన్స్ రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో) నుంచి గ్యాస్ టర్బైన్ రీసర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్(జీటీఆర్ఈ) ఆర్డర్ లభించినట్లు ఆజాద్ ఇంజినీరింగ్ లిమిటెడ్ తెలిపింది. ఈ ఆర్డర్లలో భాగంగా పూర్తిస్థాయిలో ఇంటిగ్రేటెడ్ అడ్వాన్స్ టర్బో ఇంజిన్‌లను 2026 ప్రారంభం నుంచి వీటిని డెలివరీ చేయనున్నట్లు ఆజాద్ ఇంజినీరింగ్ వర్గాలు వెల్లడించాయి.

దిగొచ్చిన బంగారం

ఒకేరోజు రూ.1,000పైగా తగ్గిన తులం

హైదరాబాద్‌లో రూ.73,420కి పసిడి ధర

హైదరాబాద్/న్యూఢిల్లీ, మే 23: రికార్డు స్థాయిలో దూసుకుపోయిన బంగారం ధరలు కాస్త శాంతించాయి. అమెరికా ఫెడరల్ రిజర్వు ఇప్పట్లో వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు లేవని స్పష్టం చేయడంతో అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు కుప్పకూలాయి. దీంతో దేశీయంగా ధరలు భారీగా తగ్గాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో అయితే ఏకంగా తులం ధర రూ.1,050 దిగింది. దీంతో తులం పుత్తడి ధర రూ.73,550కి దిగొచ్చింది. ధరలు తగ్గడం వరుసగా రెండోరోజు కావడం విశేషం. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం పుత్తడి ధర రూ.1,090 తగ్గి రూ.73,420కి దిగొచ్చింది. అంతకుముందు ధర రూ.74,510గా ఉన్నది. అలాగే రూ.1,000 తగ్గిన 22 క్యారెట్ ధర తులం ధర రూ.68,300 నుంచి రూ.67,300కి దిగింది. ఈ వారం మొదట్లో రికార్డు స్థాయి రూ.74,440కి చేరుకున్న పుత్తడి ధర మూడు శాతానికి పైగా దిగొచ్చింది.

లక్ష దిగువకు వెండి

గత కొన్ని రోజులుగా రికార్డు స్థాయిలో దూసుకుపోయిన వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ పడిపోవడంతో కిలో వెండి ఏకంగా రూ.3,300 దిగొచ్చింది. దీంతో రూ.1,00,300గా ఉన్న కిలో ధర ప్రస్తుతం రూ.97 వేలకు తగ్గింది. ఢిల్లీలో కిలో వెండి ధర రూ.2,500 తగ్గి రూ.92,600కి చేరుకున్నది. అంతకుముందు రూ.95,100 గా ఉన్నది. అలాగే ఫెడ్ రిజర్వు సభ్యుడు వ్యాఖ్యలతో అంతర్జాతీయ మార్కెట్లో ఒకే రోజు ఔన్స్ ధర 42 డాలర్లు పడిపోయి 2,375 డాలర్లకు చేరుకున్నది. అలాగే వెండి ధర 30.80 డాలర్ల వద్ద నిలిచింది.

సింగరేణికి ఆస్ట్రేలియా మైనింగ్ టెక్నాలజీ

సీఎండీ బలరామ్‌తో ఆ దేశ ట్రేడ్, ఇన్వెస్ట్‌మెంట్ కమిషనర్ భేటీ

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): రానున్న ఐదేండ్లలో 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకోసం అవసరమైన ఆధునిక మైనింగ్ టెక్నాలజీ, శాస్త్ర సాంకేతిక అంశాలపై తమ సంపూర్ణ సహకారం అందించడానికి ఆస్ట్రేలియా ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ముందుకొచ్చింది. ఈ మైనింగ్ టెక్నాలజీ, సాంకేతిక అంశాలపై ఆస్ట్రేలియా ట్రేడ్, ఇన్వెస్ట్‌మెంట్ కమిషనర్ డెనిస్ ఈటెన్‌తో సింగరేణి సీఎండీ బలరామ్ సమావేశమయ్యారు. ప్రస్తుతం సంస్థ వినియోగిస్తున్న సాంకేతిక, ఈ ఏడాది సాధించిన ప్రగతి, వ్యాపార విస్తరణలో భాగంగా థర్మల్, సోలార్ రంగంలోకి అడుగుపెట్టిన విషయాన్ని ఆయన వివరించారు. మరోవైపు, వచ్చే నవంబర్‌లో ఆస్ట్రేలియా బృందం సింగరేణి ప్రాంతంలో పర్యటించనున్నదని, దీంట్లోభాగంగా కంపెనీ వినియోగిస్తున్న టెక్నాలజీ, నూతన వ్యాపార విస్తరణ చర్యలను స్వయంగా తెలుసుకోనున్నట్లు ఆస్ట్రేలియా కమిషనర్ తెలిపారు.

ప్రీ-ఓన్డ్ కార్లకు భలే గిరాకీ

2027-28కల్లా మార్కెట్ విలువ 73 బి.డాలర్లకు: ఐబీబీ

న్యూఢిల్లీ, మే 23: దేశంలోని ప్రీ-ఓన్డ్ కార్ల (యూజ్డ్ కార్ల) విక్రయ మార్కెట్ 2027-28 ఆర్థిక సంవత్సరం నాటికి 1.09 కోట్ల యూనిట్లకు చేరవచ్చని ఇండియన్ బ్లూ బుక్ (ఐబీబీ) తాజా నివేదిక ఒకటి అంచనా వేసింది. దీని విలువ 73 బిలియన్ డాలర్లుగా ఉండగా, ప్రస్తుత విలువతో పోల్చితే రెట్టింపునకుపైనే కావడం గమనార్హం. 2022-23 ఆర్థిక సంవత్సరంలో దేశీయంగా యూజ్డ్ కార్ల అమ్మకాలు దాదాపు 51 లక్షల యూనిట్లుగా ఉన్నాయి. వీటి విలువ 32.44 బిలియన్ డాలర్లుగా ఉన్నది. 'వ్యక్తిగత వాహనాలకు పెరుగుతున్న ప్రాధాన్యతేగాక, పెరిగిన ఆదాయాలు, స్వల్పకాలంలోనే వాహనాల మార్పు వంటి అంశాలూ.. ప్రీ-ఓన్డ్ కార్ల డిమాండ్‌ను పెంచేస్తున్నది' అని ఐబీబీ రిపోర్టు చెప్తున్నది. అలాగే కరోనా తర్వాత చాలామంది వ్యక్తిగత వాహనాల వైపు చూస్తున్నారని, దీంతో యూజ్డ్ కార్లకు డిమాండ్ పెరిగిందని పేర్కొన్నది. ఈ క్రమంలోనే 2026-27 ఆర్థిక సంవత్సరం నాటికి 80 లక్షల యూనిట్లకు యూజ్డ్ కార్ల మార్కెట్ చేరవచ్చన్నది.

తక్కువ బడ్జెట్‌లో..

కొత్త కార్ల ధరలతో పోల్చితే 15-25 శాతం ధరల్లోనే యూజ్డ్ కార్లు అందుబాటులో ఉంటుండటం ఇప్పుడు ఈ మార్కెట్‌ను పరుగులు పెట్టిస్తున్నది. ఏదైనా కంపెనీకి చెందిన ఓ మాడల్ కొత్త కారు ధర రూ.10 లక్షలుగా ఉంటే.. అదే మాడల్ పాత కారు ధర రూ.2 లక్షలుగానే ఉండటం.. కస్టమర్లను ఈ వైపు చూసేలా చేస్తున్నదని మార్కెట్ వర్గాలు ట్రెండ్‌ను విశ్లేషిస్తున్నాయి. కండీషన్‌లో ఉండి, తక్కువ కిలోమీటర్లు తిరిగి, అప్‌గ్రేడ్ వెర్షనైతే మరో రూ.50,000ల నుంచి లక్ష రూపాయలు ఎక్కువగా పెట్టుకోవాల్సి వస్తుందని చెప్తున్నారు. దీంతో అన్నివిధాలా సరిపోయే కారు రూ.2.5 లక్షలు-3 లక్షల్లో వచ్చేస్తున్నది. ఇక ఇప్పటికే కార్లున్నవారు అప్‌గ్రేడ్ వెర్షన్‌లోకి మారడం కూడా యూజ్డ్ కార్ల మార్కెట్‌లోకి పెద్ద ఎత్తున వాహనాలు వచ్చేలా చేస్తున్నది. ఇదిలావుంటే కుటుంబం మొత్తం తక్కువ ఖర్చుతో ప్రయాణించే వెసులుబాటు ఉండటం, ప్రైవసీ, ఇతరత్రా సౌకర్యాల వల్ల కూడా ఇప్పుడు మధ్యతరగతి వర్గాలు యూజ్డ్ కార్లవైపే ఇష్టం కనబరుస్తున్నాయి. మొత్తానికి లగ్జరీ కార్ల దగ్గర్నుంచి, మిడిల్, స్మాల్ సెగ్మెంట్లలోని కార్లు ఈ ప్రీ-ఓన్డ్ వెహికిల్ మార్కెట్‌లో లభిస్తున్నాయి.

కరీంనగర్ ఫిలిగ్రీకి దక్కిన గౌరవం

ముకేశ్ అంబానీ కొడుకు వివాహ వేడుకలో అతిథులకు ఇచ్చేందుకు ఎంపిక

కమాన్‌చౌరస్తా, మే 23 : కరీంనగర్ ఫిలిగ్రీకి ప్రత్యేక గౌరవం దక్కింది. ప్రముఖ వ్యాపార దిగ్గజం ముకేశ్ అంబానీ, నీతా దంపతుల కొడుకు అనంత్ అంబానీ వివాహం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న చేనేత హస్తకళా రూపాలను దేశ విదేశాలకు చెందిన అతిథులకు బహుమతులుగా ఇవ్వాలని నిర్ణయించారు. ఈ క్రమంలో కరీంనగర్ ఫిలిగ్రీకి దాదాపు 400 వస్తువుల కోసం ఆర్డర్ చేసినట్లు కరీంనగర్ ఫిలిగ్రీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎర్రోజు అశోక్, కార్యదర్శి గద్దె అశోక్ కుమార్ తెలిపారు. ఇందులో జ్యువెలరీ బాక్సులు, పర్సులు, ట్రేలు, ఫ్రూట్ బౌల్స్, తదితరులు ఉన్నట్లు చెప్పారు.

ఇండిగో ప్రీమియం క్లాస్!

న్యూఢిల్లీ, మే 23: అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో..విమానాల్లో బిజినెస్ క్లాస్ సీట్లను ప్రవేశపెట్టడానికి సిద్ధమవుతున్నది. ప్రయాణికుల నుంచి పెరుగుతున్న డిమాండ్‌తో ఈ ఏడాది చివరినాటికి ఈ బిజినెస్ క్లాస్ సీట్లు అందుబాటులోకి తేనున్నట్లు కంపెనీ సీఈవో పీటర్ ఎల్బర్స్ తెలిపారు.

సెన్సెక్స్ హై జంప్

మార్కెట్లకు ఆర్బీఐ కిక్కు ● ఆల్‌టైమ్ గరిష్ఠానికి సూచీలు

1,197 పాయింట్లు ఎగిసి 75,418కి సెన్సెక్స్ ● 370 పాయింట్లు ఎగబాకి 22,968 వద్ద నిఫ్టీ

ముంబై, మే 23: దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ లాభాల్లో ముగిశాయి. కేంద్ర ప్రభుత్వానికి బుధవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రకటించిన రూ.2.11 లక్షల కోట్ల మెగా డివిడెండ్.. మదుపరుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ క్రమంలోనే ఉదయం ఆరంభం నుంచే జోరు మీదున్న సూచీలు.. సమయం గడుస్తున్నకొద్దీ పరుగందుకున్నాయి. చివరకు మునుపెన్నడూ లేనివిధంగా ఆల్‌టైమ్ హై వద్ద స్థిరపడ్డాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,196.98 పాయింట్లు లేదా 1.61 శాతం ఎగిసి 75వేల మార్కుకు ఎగువన 75,418.04 వద్ద నిలిచింది. ఈ ఏడాది జనవరి 29 తర్వాత ఒక్కరోజే సెన్సెక్స్ ఈ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి. ఇక ఒకానొక దశలో 1,278.85 పాయింట్లు పెరిగింది. దీంతో 75,499.91 స్థాయిని చేరి ఇంట్రా-డే ఆల్‌టైమ్ హై రికార్డును నెలకొల్పింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 23వేల స్థాయికి చేరువైంది. 369.85 పాయింట్లు లేదా 1.64 శాతం పుంజుకొని 22,967.65 వద్ద స్థిరపడింది. ఇంట్రా-డేలో 395.8 పాయింట్లు పెరిగి మొదటిసారి 22,993.60 స్థాయిని తాకింది.

రంగాలవారీగా..

ఆటో రంగ షేర్లు అత్యధికంగా 2.28 శాతం పెరిగాయి. ఆ తర్వాత క్యాపిటల్ గూడ్స్ 2.13 శాతం, బ్యాంకింగ్ 1.98 శాతం, ఆర్థిక సేవలు 1.64 శాతం, సేవలు 1.63 శాతం, టెక్నాలజీ 1.42 శాతం, కన్జ్యూమర్ డిస్‌క్రీషనరీ 1.19 శాతం, ఐటీ 1.18 శాతం చొప్పున లాభపడ్డాయి. షేర్లవారీగా.. మహీంద్రా అండ్ మహీంద్రా, ఎల్‌అండ్‌టీ, యాక్సిస్ బ్యాంక్, మారుతి, అల్ట్రాటెక్ సిమెంట్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, టైటాన్, టీసీఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు లాభపడ్డాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 0.58 శాతం, స్మాల్‌క్యాప్ 0.27 శాతం పెరిగాయి.

- నిఫ్టీ 2 ట్రిలియన్ డాలర్ల మార్కును 2017 జూలైలో తాకగా, 3 ట్రిలియన్ డాలర్లకు 2021 మేలో, 4 ట్రిలియన్ డాలర్లకు 2023 డిసెంబర్‌లో వెళ్లింది.
- ఈక్విటీ సెగ్మెంట్ రోజువారీ సగటు టర్నోవర్ 2014-15 నుంచి 2023-24 వరకు 4.5 రెట్లు పెరిగి రూ.81,721 కోట్లకు చేరుకున్నది.

10 లక్షల కోట్ల డాలర్లకు..

భారీ లాభాల మధ్య బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో నమోదైన సంస్థల మార్కెట్ విలువ 10 లక్షల కోట్ల డాలర్లను మించిపోయింది. బుధవారం బీఎస్ఈ మార్కెట్ విలువ 5 లక్షల కోట్ల డాలర్ల మార్కును తొలిసారి తాకగా, గురువారం ఎన్ఎస్ఈ మార్కెట్ విలువ మొదటిసారి ఈ రికార్డును సాధించింది. ఇక ఈ ఒక్కరోజే బీఎస్ఈ నమోదిత మదుపరుల సంపద రూ.4.28 లక్షల కోట్లు పెరిగింది. రూ.4,28,602.18 కోట్లు పుంజుకొని రూ.420.22 లక్షల కోట్లు (5.05 ట్రిలియన్ డాలర్లు)గా నమోదైంది. అలాగే ఎన్ఎస్ఈలో నమోదైన సంస్థల మార్కెట్ విలువ రూ.416.57 లక్షల కోట్లు (5 ట్రిలియన్ డాలర్లు)గా ఉన్నది. దీంతో ఈ రికార్డును సాధించిన 5వ దేశంగా భారత్ నిలిచింది.

ఎయిర్ ఇండియా ఉద్యోగుల వేతన పెంపు!

న్యూఢిల్లీ, మే 23:ఎయిర్ ఇండియా ఉద్యోగులకు శుభవార్తను అందించింది యాజమాన్యం. ఉద్యోగుల వేతనాలను పెంచడంతోపాటు వార్షిక లక్ష్యాన్ని పూర్తి చేసుకున్న పైలెట్లకు బోనస్‌ను కూడా అందించనున్నట్లు గురువారం ప్రకటించింది. ఎయిర్ ఇండియా సీహ